సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



అప్పన్న సన్నిధిలో..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ ఆనంద్ దర్శించుకున్నారు. 8లో



రైల్వేలో మెరుగైన సేవలు

విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో శనివారం స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ 2వ సమావేశం జరిగింది. 8లో



ఆరోగ్య 'సిరి'

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన నాల్గో విశాఖ ఆర్గానిక్ మేళా ఆదివారంతో ముగియనుంది. 8లో

న్యూస్‌రీల్

సీపీ రవిశంకర్‌కు బంగారం పతకం



సీపీ రవిశంకర్‌కు గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

విశాఖ సిటీ: శాంతి భద్రతల విభాగంలో ఉత్తమ ప్రతిభ చూపించిన నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌కు బంగారు పతకం లభించింది. 2022లో రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతల విషయంలో ప్రతిభ చూపించిన కానిస్టేబుల్ నుంచి అడిషినల్ డీజీ స్థాయి అధికారులకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి డిస్క్ అవార్డు కింద బంగారం, వెండి, రజత పతకాలను అందజేశారు. ఇందులో భాగంగా 2022లో క్షేత్ర స్థాయిలో శాంతిభద్రతల విభాగంతో పాటు దిశ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌లో ఉత్తమ ప్రతిభ చూపించిన సీపీ రవిశంకర్‌కు శనివారం మంగళగిరిలో డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేసి అభినందించారు.

ఇండియన్ ఎలక్ట్రికల్ సిస్టమ్ ఇంటిగ్రేటర్స్ కోసం ఆహ్వానం



సాక్షి, విశాఖపట్నం : ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా గ్రీన్‌టగ్స్ నిర్మాణానికి హిందూస్థాన్ షిప్‌యార్డు(హెచ్‌ఎస్‌ఎల్) అడుగులు వేస్తోంది. గ్రీన్ టగ్ ప్రాజెక్ట్స్‌కు అవసరమైన ఇండియన్ ఎలక్ట్రికల్ సిస్టమ్ ఇంటిగ్రేటర్స్(ఐఈఎస్ఐ) కోసం ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పంచకర్మ సంకల్ప్ ప్రాజెక్టులో భాగంగా గ్రీన్ టగ్ ట్రాన్సిషన్ ప్రోగ్రామ్ ద్వారా షిప్‌యార్డు ఈ అవకాశాల్ని దక్కించుకుందని పేర్కొన్నారు. కర్బన ఉద్గారాల నియంత్రణలో భాగంగా ప్రస్తుతం ఉన్న ఇంధన టగ్‌ల స్థానంలో అత్యాధునిక సాంకేతికతతో టగ్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. 40 నుంచి 80 టన్నుల బొల్లార్డ్ పుల్ ఈ-టగ్స్ నిర్మాణంపై దృష్టిసారించామన్నారు. ఇందుకోసం షిప్‌యార్డు వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1,2 పరీక్షలకు ఉచిత శిక్షణ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షలపై ఉచిత శిక్షణ అందించనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎస్.శ్రీదేవి తెలిపారు. డిగ్రీలో వచ్చిన మార్కులు ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. గ్రూప్-1 శిక్షణకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొత్తం 60 మందిని ఎంపిక చేయనుండగా.. జనవరి 5వ తేదీ నుంచి 60 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. గ్రూప్-2 శిక్షణకు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణకు 40 మందిని ఎంపిక చేయనుండగా ఈ నెల 27వ తేదీ నుంచి 50 రోజుల పాటు శిక్షణ ఇస్తామని.. దరఖాస్తులను స్టడీ సర్కిల్‌లో అందించాలన్నారు. పూర్తి వివరాలకు 0891- 2564346, 9492569177ను సంప్రదించవచ్చు.

2024లో కార్మిక సెలవులివే..

సీతంపేట: 2024లో జాతీయ పండగలు, ఇతర పండగ సెలవుల జాబితాను అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయం విడుదల చేసింది. జనవరి 26న రిపబ్లిక్ డే, మే 1న మేడే, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, అక్టోబరు 2న గాంధీ జయంతి, నవంబరు 1న ఏపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సెలవు ప్రకటించారు. అలాగే జనవరి 16న కనుమ పండగ, ఏప్రిల్ 11న రంజాన్, సెప్టెంబర్ 7న వినాయక చవితి, డిసెంబరు 25న క్రిస్మస్ సెలవు దినాలుగా ప్రకటిస్తూ ఓ ప్రకటనలో పేర్కొంది.

- రూ.4.69 కోట్ల ప్రాజెక్టుకు వీఎంఆర్డీఏ ప్రణాళికలు
- రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- నిర్మాణాలకు పరిపాలన అనుమతులు

సైన్స్ సిటీకి ముందడుగు



కైలాసగిరిపై ఏర్పాటు చేయనున్న సైన్స్ సిటీ నమూనా

విశాఖ సిటీ: ఆధ్యాత్మిక.. పర్యాటక కేంద్రంగా.. విరాజిల్లుతున్న కైలాసగిరి.. త్వరలో శాస్త్రీయ విజ్ఞానానికి వేదికగా కూడా మారనుంది. ప్రకృతి అందాలతో ప్రపంచ పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తున్న ఈ ప్రాంతం ఇకపై శాస్త్ర, సాంకేతిక అద్భుతాల ప్రదర్శనకు నెలవు కానుంది. కైలాసగిరిపై అధునాతన సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణానికి మార్గం సుగమమైంది. ప్లానిటోరియం ప్రాజెక్టులో భాగంగా రూపొందించిన సైన్స్ సిటీ ప్రాజెక్టు ప్రతిపాదనలకు ఇప్పటికే కేంద్ర సాంస్కృతిక, మంత్రిత్వ శాఖ ఆమోద ముద్ర వేయగా.. తాజాగా నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. రూ.4.69 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు మ్యూజియం గ్రాంట్ స్కీమ్ కింద గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం ప్రాజెక్టు విలువలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా 80 శాతం వాటా కింద కేంద్రం రూ.3.75 కోట్లు, మిగిలిన రూ.93.8 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించనుంది. త్వరలోనే ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పర్యాటక విజ్ఞాన కేంద్రంగా..

అందాల విశాఖ నగరానికి వచ్చే ప్రతి సందర్శకుడూ కైలాసగిరికి వెళుతుంటారు. విదేశాల నుంచి వచ్చే 10 మంది పర్యాటకుల్లో.. 8 మంది కైలాసగిరిని సందర్శిస్తుంటారని పర్యాటక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. గిరిపై నుంచి చూస్తే.. **నగరి సొగసులు.. వయ్యారాలు ఒలకబోస్తున్న తీరం సోయగాలు పర్యాటకలను కట్టివడేస్తాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. టూరిజం ఐకాన్‌గా** కైలాసగిరిని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కైలాసగిరి అభివృద్ధికి వీఎంఆర్డీఏ పూర్తి స్థాయి ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా సముద్ర మట్టానికి 110 మీటర్ల ఎత్తులో ఉన్న కైలాసగిరిపై సాంకేతిక, శాస్త్రీయ విజ్ఞాన కేంద్రం ద్వారా పర్యాటకలను అబ్బురపరిచే విధంగా సైన్స్ సిటీ ప్రాజెక్టును తీర్చిదిద్దనున్నారు.

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా..

ప్లానిటోరియం ప్రాజెక్టులో భాగంగా సైన్స్ సిటీ ఏర్పాటు చేసేందుకు వీఎంఆర్డీఏ సంసిద్ధమవుతోంది. పిల్లల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పించేందుకు ఉపకరించే అనేక అంశాలను సైన్స్ సిటీలో అంతర్భాగం చేసే విధంగా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలు, అంతరిక్ష పరిశోధన, అధునాతన రాకెట్ మోడల్స్, పవన శక్తి, భూగోళం తదితర శాస్త్ర, సాంకేతిక అంశాలతో దీనిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దీనిలో ఆయా శాస్త్ర, సాంకేతిక అంశాలకు సంబంధించిన పెవిలియన్లు, ఇండోర్, ఔట్‌డోర్ ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేసి స్కూలు విద్యార్థులు, సైన్స్, పరిశోధన పట్ల అభిరుచి ఉన్న వారిని ప్రోత్సహించే విధంగా ప్రాజెక్టును తీర్చిదిద్దనున్నారు.

రూ.4.69 కోట్లతో..

సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణానికి రూ.4.69 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాస్తవానికి ప్లానిటోరియంలో భాగంగా ఈ సైన్స్ సిటీని ఏర్పాటు చేయాలని అధికారులు ముందు భావించారు. దీనికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సైతం తయారు చే శారు. అయితే సైన్స్ సిటీకి కేంద్రం నిధులు మంజూరు చేస్తుండడంతో ముందుగా దీన్ని అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. కోల్‌కతా, మంగుళూరులోని పిలికుల ప్రాంతీయ సైన్స్ సెంటర్ తరహాలో దీన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. వీఎంఆర్డీఏ రూపొందించిన ప్రతిపాదనలకు కేంద్రం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. దీంతో త్వరలోనే ఈ ప్రాజెక్టులు పట్టాలెక్కనుంది. ఆ దిశగా వీఎంఆర్డీఏ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

ట్యాబ్‌లతో విద్యార్థులకు మెరుగైన విద్య

- గేమింగ్ ద్వారా విద్య.. అతిపెద్ద ప్రయోగం
- పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్
- 6 జిల్లాలకు 45 వేల ట్యాబ్‌ల పంపిణీ



చంద్రంపాలెం హైస్కూల్‌లో ఎంఈవోలకు సూచనలిస్తున్న చీఫ్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చిన్న చిన్న పజిల్స్‌తో ట్యాబ్‌ల ద్వారా విద్య అందించడం.. అతి పెద్ద ప్రయోగమని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ చెప్పారు. ఉత్తరాంధ్రలోని పాఠశాలలకు మండలానికి 340 చొప్పున 45 వేల ట్యాబ్‌లను శుక్రవారం చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లలో కూడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. వీటిని పాఠశాలల్లో పంపిణీ చేసేటప్పుడు.. ఓ 9వ తరగతి విద్యార్థిని, ట్యాబ్‌ను బాగా ఉపయోగించే టీచర్‌తో గత ఏడాది అనుభవాలను చెప్పించి.. అందులో రికార్డ్ చేయాలన్నారు. ట్యాబ్‌లపై దేశ వ్యాప్తంగా చర్చ సాగుతోందని, వీటి ఉపయోగం మరింత పెరగాలన్నారు. ఏదైనా కొత్త అంశం నేర్చుకోవాలంటే కొంత సమయం పడుతుందన్నారు. ఉపాధ్యాయుడు, అధికారి ఎవరైనా ఇష్టమైన సబ్జెక్ట్‌లో చాప్టర్‌ని ట్యాబ్‌ల ద్వారా నేర్చుకుని.. స్వీయ విశ్లేషణ చేయాలన్నారు. తాను కూడా ట్యాబ్‌ల్లో కంటెంట్ నేర్చుకుంటున్నట్లు చెప్పారు. గేమింగ్.. చదువు నేర్చుకునే ఓ అప్లికేషన్ అని చెప్పారు. ఒకప్పుడు బాగా వీడియో గేమ్స్ ఆడేవారని, టైపింగ్ కూడా ఆ విధంగానే నేర్చుకునేవారని గుర్తు చేశారు. టీచింగ్ అండ్ లెర్నింగ్‌లో ప్రభావం చూపాలంటే.. ముందు ఆర్జేడీ నుంచి ఉపాధ్యాయుడు వరకు ట్యాబ్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో చంద్రకళ, స్టేట్ నోడల్ ఆఫీసర్ సీహెచ్‌వీఎస్ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

భీమునిపట్నం: రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ శనివారం భీమిలిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్), ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ముందుగా డైట్‌లో ఛాత్రోపాధ్యాయులతో మాట్లాడారు. ఛాత్రోపాధ్యాయులందరూ చక్కగా శిక్షణ పొందాలని సూచించారు. ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన ఎంఎల్‌టీ తరగతిని సందర్శించారు. అనాటమీ రికార్డులను పరిశీలించగా.. 38 మందిలో కేవలం 9 మంది రికార్డులనే అధ్యాపకుడు వెరిఫికేషన్ చేసినట్టు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తోందని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ విషయంలో ప్రిన్సిపాల్ సూర్యప్రసాద్, అధ్యాపకులను పిలిచి మందలించారు. మరో నెలలో కళాశాలకు మళ్లీ వస్తానని.. అప్పటికీ తీరు మారకపోతే తగిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. డీఈవో చంద్రకళ, డీవీఈవో రాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు. అలాగే 58వ వార్డు ములగాడ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, షిప్‌యార్డ్‌కాలనీలోని గాంధీగ్రామ్ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. గాంధీగ్రామ్ హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీకి హాజరైన తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. మ్యాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్ట్‌ల్లో ప్రశ్నలు అడిగి.. వారిచ్చిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

రోడ్డెక్కిన స్టీల్‌ప్లాంట్ అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారులు తమ డిమాండ్లపై శనివారం రోడ్డెక్కారు. పదోన్నతులు, పీఆర్సీ చెల్లింపులు, విద్యుత్ చార్జీలు తగ్గింపు, వేతన సవరణ, పెన్షన్ బకాయిలు చెల్లింపు తదితర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలంటూ ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. సీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత, ఆర్థిక భారం విముక్తికి సెయిల్‌లో విలీనమే పరిష్కారమన్నారు. ఈ అంశంపై ఉక్కు కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, సీ కార్యవర్గాలు తీర్మానం చేశాయన్నారు. పదోన్నతులు కల్పించకపోవడం వల్ల యువ అధికారులు ప్లాంట్‌ను వదిలి వెళ్లిపోతున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా స్టీల్‌ప్లాంట్ అధికారులకు రూ. 8.14 పైసలు వసూలు చేస్తున్నారన్నారు. పై సమస్యలకు తోడు వేతనాల చెల్లింపులో వివక్ష చూపటం అన్యాయమన్నారు. అందరికీ సకాలంలో జీతాలు ఒకేసారి చెల్లించాలన్నారు. ఉక్కు కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచందరావు, యు.రామస్వామి నిరసనకు సంఘీభావం ప్రకటించారు.

పసికందు ప్రాణాలు నిలిపిన కేజీహెచ్ వైద్యులు



చిన్నారి తల్లిదండ్రులతో కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, వైద్యులు

మహారాణిపేట: తల్లి గర్భంలో ఉండగానే అరుదైన గుండె జబ్బుతో బాధపడిన పసికందు ప్రాణాలను కేజీహెచ్ వైద్యులు కాపాడారు. ప్రసూతి, రేడియాలజీ, గుండె జబ్బులు, పిల్లల విభాగం వైద్యులు సమన్వయంతో వైద్య సేవలందించడంతో తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఇద్దరినీ డిశ్చార్జ్ చేసినట్లు శనివారం చెప్పారు. వాసవానిపాలెం ప్రాంతానికి చెందిన పేర్ల ప్రశాంతికి పురిటి నొప్పులు రావడంతో ఆమె భర్త వినోద్ ఈ నెల ఒకటో తేదీన కేజీహెచ్ ప్రసూతి విభాగంలో చేర్పించారు. పిల్లల విభాగాధిపతి డాక్టర్ ఎం.ఎస్.రాజు ఆమెకు వైద్య పరీక్షలు చేశారు. స్కానింగ్‌లో గర్భస్థ శిశువుకి ఊపిరితిత్తులు, కడుపు, గుండె చుట్టూ నీరు చేరడం, చర్మం నీటితో ఉబ్బిపోవడం(హైడ్రోప్స్ ఫెటాలిస్)ను గుర్తించారు. సరైన జాగ్రత్తలతో ఈ నెల 4న ఆమెకు శస్త్రచికిత్స చేయగా.. బాబు జన్మించాడు. ఇలాంటి వ్యాధులు గర్భస్థ శిశువుల్లో అత్యంత అరుదుగా సంభవిస్తాయని.. వైద్యులు సకాలంలో స్పందించి సేవలందించడం వల్ల బిడ్డ ప్రాణాలు కాపాడగలిగామని సూపరింటెండెంట్ వెల్లడించారు. పిల్లల వైద్య విభాగాధిపతి ఎం.ఎస్.రాజు, వైద్యులు చక్రవర్తి, భవానీశంకర్, సత్యవాణి, పద్మావతి, సింధూర, హెడ్ నర్సు విజయలక్ష్మి, ఇతర నర్సింగ్ సిబ్బందికి బిడ్డ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యశ్రీలో సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు

- పేద రోగులకు ఎంతో మేలు
- ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ సుమితా శంకర్



సుమితా శంకర్‌ను అభినందిస్తున్న వైద్యులు

మహారాణిపేట: కొన్ని సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చడం కారణంగా పేద రోగులకు ఎంతో మేలు జరుగుతోందని ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్, నగర పోలీస్ కమిషనర్ సతీమణి డాక్టర్ సుమితా శంకర్ అన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సాయిప్రియ రిసార్ట్‌లో నిర్వహిస్తున్న 83వ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ పరిశీలకురాలు సుమితా శంకర్ మాట్లాడారు. ఎలిఫెంటియాసిస్(ఫైలేరియాసిస్) శస్త్రచికిత్స విధానాలు, అనుభవాలను వివరించారు. ఇటువంటి శస్త్ర చికిత్సలను ఆరోగ్య శ్రీలో చేర్చడం ద్వారా పేద రోగులకు ప్రయోజనకరంగా మారిందన్నారు. ఏఎంసీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.సుధాకర్, కమిటీ చైర్మన్ విశ్రాంత డీఎంఈ డాక్టర్ జి.శాంతరావు, అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పి.వి.రమణమూర్తి, కోశాధికారి జి.భాస్కరరావు, వైద్యులు ఎస్.సుబ్బారావు, వి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ 'కృష్ణ లీలలు'

- ఒక్కొక్కటిగా బయటపడుతున్న రియల్ ఎస్టేట్ సంస్థ బాగోతాలు
- ఒకే స్థలాన్ని ఇద్దరు, ముగ్గురి పేర్ల మీద రిజిస్ట్రేషన్లు
- 1995లో కొనుగోలు చేసిన వారికి స్థలాలు చూపించకుండా తిప్పుతున్న వైనం
- అక్రమాలకు సహకరించకుంటే ఏసీబీ ఫిర్యాదు చేస్తానని హెచ్చరిక
- ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్‌పై ఇప్పటికే పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు
- లబోదిబోమంటున్న బాధితులు





ఒకే స్థలం సర్వే నెంబర్ 105/29తో జయరాజుకు, సర్వే నెంబర్ 105/9తో శేషు రమణికి రిజిస్ట్రేషన్

విశాఖ సిటీ : ఒకే స్థలం.. ఇద్దరి ముగ్గురు పేర్ల మీద రిజిస్ట్రేషన్లు చేసేశారు. ఒకే ప్లాట్‌ను సబ్ డివిజన్లు మార్చి విక్రయించేశారు. 1995లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఇప్పటికీ స్థలాలను చూపించకుండా తిప్పుకుంటున్నారు. కార్యాలయానికి వెళితే.. ఆఫీస్ మారిపోయిందని చెప్పి తప్పించుకుంటున్నారు. సంస్థ ఎండీకి ఫోన్ చేస్తే చంపేస్తానని బెదిరిస్తున్నారు. ఇదీ కిరణ్‌కృష్ణ రియల్ ఎస్టేట్ అండ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ బాగోతం. ఈ సంస్థ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా తాము కొనుగోలు చేసిన స్థలాన్ని చూపించడం లేదని కొందరు.. తమకు అమ్మిన స్థలాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయించేశారని మరికొందరు నగరంలో పలు స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. స్థలాన్ని చూపించాలని అడిగిన వ్యక్తిని చంపేస్తానని బెదిరించినట్లు గత నాలుగు రోజుల క్రితమే కిరణ్‌కృష్ణ సంస్థ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్‌పై ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు అందింది. అలాగే సదరు ఎండీ నేరుగా తనకు ఫోన్ చేసి బెదిరించినట్లు ఆనందపురం సబ్ రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. అక్రమాలకు సహకరించకుంటే ఏసీబీ ఫిర్యాదు చేస్తానని హెచ్చరించినట్లు సబ్ రిజిస్ట్రార్ ఆరోపించారు. ఇదిలా ఉంటే.. తాజాగా మరో వ్యవహారంపై వెలుగులోకి వచ్చింది.

ఒకే స్థలాన్ని వేరొకరికి విక్రయించి..

కిరణ్‌కృష్ణ రియల్ ఎస్టేట్ సంస్థ సుమారు 30 ఏళ్ల క్రితం ఆనందపురం మండలం గండిగుండంలో 58 ఎకరాల్లో ప్రైవేటు లేఅవుట్ వేసింది. దానికి ఎటువంటి దారి లేకుండా ఇష్టానుసారంగా ప్లాట్లుగా విభజించి విక్రయాలు చేపట్టింది. శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన డేవిడ్ జయరాజు అనే బీహెచ్‌పీవీ ఉద్యోగి ఈ అవుట్‌లో సర్వే నెంబర్ 105/29లో (272 ప్లాట్ నెంబర్) 300 గజాలను 1995లో కొనుగోలు చేశాడు. వీరి పేరున రిజిస్ట్రేషన్ అయిన తరువాత అప్పుడప్పుడు ఆ స్థలాన్ని చూసి వచ్చేవాడు. 2020లో స్థలానికి ఎల్ఆర్ఎస్ చేయించాలని వీఎంఆర్డీఏలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఆ లేఅవుట్‌కు రోడ్డు లేదని చెప్పి తిరస్కరించారు. వెనుక నుంచి రోడ్డు ఉండడంతో అటుగా రోడ్డు చూపిస్తూ మరోసారి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆ స్థలం వేరొకరి పేరు మీద 2011లో రిజిస్ట్రేషన్ చేయించినట్లు డేవిడ్ జయరాజు తెలుసుకున్నాడు. అప్పటి నుంచి సీతమ్మధార అల్లూరి విగ్రహం ప్రాంతంలో ఉన్న కిరణ్ కృష్ణ కార్యాలయానికి వెళ్తుండగా అక్కడ సిబ్బంది సమాధానం చెప్పకుండా తప్పించుకుంటూ వస్తున్నారు. తాజాగా ఆ ఆఫీస్ అక్కడి నుంచి మార్చేశారని సమాధానమిస్తున్నారు. సంస్థ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్ ఫోన్‌లో కూడా అందుబాటులోకి రావడం లేదని డేవిడ్ జయరాజు వాపోతున్నారు.

సబ్ డివిజన్ మార్చి..

పల్లా శేషు రమణి అనే మహిళ గతంలో ఇదే కిరణ్‌కృష్ణలో ప్లాట్ కొనుగోలు చేసి స్థలాన్ని చూపించకపోవడంతో అనేక సంవత్సరాలు రియల్ ఎస్టేట్ ఆఫీస్ చుట్టూ తిరిగారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో తప్పు పడిందని, సవరణ చేయాలని చెప్పి.. డేవిడ్ జయరాజుకు విక్రయించిన ప్లాట్ సర్వే నెంబర్ 105/29ని 105/9గా మార్పు చేయించి.. ప్లాట్ నెంబర్ 272లో ఉన్న 300 గజాలను శేషు పేరు మీద రిజిస్ట్రేషన్ చేసేశారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఆమె పేరు మీద స్థలం నమోదై ఉంది. అయితే అక్కడ ఒకే స్థలానికి 105/29, 105/9 సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చూపిస్తున్నాయి. దీనిపై బాధితుడు జయరాజు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కిరణ్‌కృష్ణ సంస్థపై కేసులు

కిరణ్‌కృష్ణ సంస్థపైన, ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్‌పైన జిల్లాలోనే కాకుండా శ్రీకాకుళం, విజయవాడ జిల్లాల్లో కూడా కేసులు నమోదయ్యాయి. విజయవాడలో కూడా స్థలాల విక్రయాల పేరుతో అడ్వాన్స్‌లు తీసుకొని స్థలాన్ని చూపించకుండా అక్కడి నుంచి ఆఫీస్‌ను ఎత్తేసిన వ్యవహారంలో 2016లో కృష్ణప్రసాద్‌పై కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే శ్రీకాకుళంలోని టూ టౌన్, విశాఖ నగరంలోని ఫోర్త్‌టౌన్, ద్వారకా, ఆనందపురం, పీఎంపాలెం, భీమిలి ఇలా పలు పోలీస్‌స్టేషన్లలో చీటింగ్ కేసులు నమోదయ్యాయి.

వినియోగదారుల హక్కులకు రక్షణ

మహారాణిపేట: వినియోగదారుల హక్కులపై మరింత అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ నిర్వహణపై వినియోగదారుల హక్కుల కమిటీతో శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష చేశారు. స్వచ్ఛంద వినియోగదారుల సంస్థల సహకారంతో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు డివిజనల్, మండల స్థాయిలో వారోత్సవాలు నిర్వహించాలన్నారు. ఈ-కామర్స్, డిజిటల్ వర్తక శకంలో వినియోగదారుల రక్షణ అనే నినాదాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులతో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒక్కో రెవెన్యూ డివిజన్ నుంచి ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ప్రచార బాధ్యతలను వినియోగదారుల స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలని కమిటీ కోరగా.. తగిన చర్యలు చేపట్టాలని డీఎస్‌వో జి.సూర్యప్రకాశరావును జేసీ ఆదేశించారు. వారోత్సవాల్లో తూనికలు-కొలతలు, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్, ఎల్‌పీజీ డీలర్స్, ఆయిల్ మార్కెటింగ్, కంపెనీలు, ఉద్యానవన, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు భాగస్వాములు కావాలని జేసీ సూచించారు.

ఎక్స్ సర్వీస్‌మెన్ MACHBS పబ్లిక్ నోటీసు
తేది 07-01-2024 నూతన సంవత్సరం ఆదివారం ఉదయం 9గంటలకు BHPV కమ్యూనిటీ హాల్, నాతయ్యపాలెం, విశాఖలో జరగబోవు జనరల్ బాడీ మీటింగ్‌కు సొసైటీ సభ్యులందరూ హాజరు కాగలందులకు మేనేజ్‌మెంట్ వారు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కావున సభ్యులందరూ ఈ GBM కు హాజరై మీటింగ్‌ని దిగ్విజయం చేస్తారని కోరుతున్నాము.
పొందూరు సూర్యనారాయణ, B.A., LLB.,
ప్రెసిడెంట్ Ex. Servicemen MACHBS Ltd. VSP
Contact No. 8886234548

IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S. No: 518/2022
Between :
M/s. Sahara Housingfina Corporation Ltd., Represented by Branch Head Sri. Majety Naga Srinivas .....Plaintiff
And :
1. Gummadi Jhansi Lakshmi
2. Polumuri Praveen Kumar
3. Munjeti Srinivasa Rao ..... Defendants

NOTICE TO
1. Gummadi Jhansi Lakshmi
2. Polumuri Praveen Kumar
3. Munjeti Srinivasa Rao

Please take Notice that, the Plaintiff M/s. Sahara Housingfina Corporation Ltd., Represented by Branch Head Sri. Majety Naga Srinivas filed a Suit against the above referred 1st, 2nd and 3rd Defendants in O.S. No: 518/2022 and the matter stand posted to **04-01-2024** for appearance of 1st, 2nd and 3rd Defendants before this Honourable Court. And in the above suit, the Petitioner / Plaintiff filed I.A. No: 249/2022 and the matter stand posted to **04-01-2024** for appearance of 1st, 2nd and 3rd Respondents/ Defendants before this Honourable Court.

Therefore please take notice to 1st, 2nd and 3rd Defendants in the above numbered suit and please take notice to 1st, 2nd and 3rd Respondents/ Defendants in above numbered I.A. to attend before the III Additional Junior Civil Judge court at Visakhapatnam on **04-01-2024** by either personally or through an Advocate at **10:30 A.M**, if failing which the matter will be decided exparte in your absence.

SRINIVAS PANDURI,
Advocate
Gopalapatnam, Visakhapatnam -530027
By Court Order dated 04-12-2023

ఆరోగ్య 'సిరి'

- చిన్నారులకు తృణధాన్యాలను చేరువ చేసే విధంగా ఉత్పత్తులు
- నేటితో ముగియనున్న ఆర్గానిక్ మేళా

ఏయూక్యాంపస్: తృణధాన్యాలను చిన్నారులకు చేరువ చేసే విధంగా పలు సంస్థలు కృషి చేస్తున్నాయి. జొన్నలు, సజ్జలు, ఊదలు, రాగులు వంటివి ఉపయోగించి చిన్నారులు ఇష్టంగా తినే తినుబండాలు తయారు చేస్తున్నాయి. వీటిని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న విశాఖ ఆర్గానిక్ మేళాలో పలువురు విక్రయిస్తున్నారు. మిల్లెట్స్‌ను ఉపయోగించి తయారు చేసిన బిస్కెట్లు, నూడిల్స్, సేమ్యా, రస్కులు, చిప్స్ వంటి ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వీటిని కొనుగోలు చేయడానికి నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు పాలల్లో వేసుకుని తినడానికి వీలుగా ఉండే రాగి, జొన్న, సజ్జ అటుకులు విక్రయిస్తున్నారు.

నేటితో ముగియనున్న మేళా

ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన నాల్గో విశాఖ ఆర్గానిక్ మేళా ఆదివారంతో ముగియనుంది. ఈ మేళాలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు, రైతులు 160 స్టాళ్లలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహార పదార్థాలు, ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఆదివారం మిద్దె తోటలు పెంపకం చేసే వారితో సదస్సు నిర్వహిస్తున్నారు. సందర్శకుల కోసం ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయగా.. సేంద్రియ ఉత్పత్తులు, చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ వంటకాల రుచులను ప్రజలు ఆస్వాదిస్తున్నారు.

మార్కెటింగ్ తోడైతే... సేంద్రియ సిరులు

ఏయూక్యాంపస్: సేంద్రియ పంటలకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కల్పించే బాధ్యతను ప్రభుత్వం స్వీకరించాలని రైతు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న విశాఖ ఆర్గానిక్ మేళాలో శనివారం సేంద్రియ రైతులు, వ్యాపారుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సమున్నతి సంస్థ నిర్వాహకుడు సాయి ప్రసాద్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేకుండా.. స్థానిక వనరుల ఆధారంగా పండించిన పంటలకు అంతర్జాతీయంగా గిరాకీ ఉందన్నారు. అయితే వీటికి ఆర్గానిక్ గుర్తింపు సాధించడంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వ రంగ సంస్థలు చొరవ తీసుకుని సేంద్రియ పంటలకు సులభతరమైన గుర్తింపు, సర్టిఫికేషన్ అందించే వ్యవస్థలను అభివృద్ధి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ పంటల మార్కెటింగ్‌ను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతు సాధికార సంస్థ ప్రతినిధి ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సేంద్రియ పంటల విక్రయానికి అందిస్తున్న ప్రోత్సాహన్ని వివరించారు. సమావేశంలో కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమారస్వామి, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రతినిధి జనార్దన్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణారావు, ఆర్‌వైఎస్ఎస్ ప్రతినిధి కృష్ణారావు, గో ఆధారిత ప్రకృతి రైతు సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్య వర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్టాల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్



తృణధాన్యాలతో తయారుచేసిన స్నాక్స్ విక్రయాలు

విదేశీయుల సందడి

ఆర్గానిక్ మేళాను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శనివారం సాయంత్రం సందర్శించారు. ప్రతీ స్టాల్ వద్దకు వెళ్లి వారి ఉత్పత్తులు, తయారీ విధానం వంటివి అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ ఉత్పత్తులతో తయారు చేసిన ఆహార పదార్థాల రుచిని ఆస్వాదించారు. పలువురు విదేశీయులు మేళాను సందర్శించారు. వారితో కమిషనర్ మాట్లాడి.. వారి అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకున్నారు.

అప్పన్న సన్నిధిలో ఎన్నికల అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ ఆనంద్, అండర్ సెక్రటరీ లవ్‌కుష్ యాదవ్ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద వారికి అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిరువురూ ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో వారి పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి, వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను సూపరింటెండెంట్ కనకరాజు అందించారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో శనివారం స్టేషన్ డైరెక్టర్ వెంకటపతిరాజు ఆధ్వర్యంలో స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ 2వ సమావేశం జరిగింది. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి కావాల్సిన సలహాలు, సూచనలను సభ్యుల నుంచి స్వీకరించారు. సమావేశంలో ఆపరేషన్స్, సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్, ఆరోగ్యం, కమర్షియల్, ఎలక్ట్రికల్, ఆర్పీఎఫ్, గతిశక్తి విభాగాల అధికారులు, ఐశ్వర్య(చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్), ఎస్ఎస్ఎస్ఎస్ రెడ్డి(డైరెక్టర్, డాల్ఫిన్ జూనియర్ కాలేజీ), కొప్పల రామ్‌కుమార్ (సామాజిక కార్యకర్త), పి.వి.ఎస్.కె సురేష్(అడ్వకేట్), ఎన్.బాబ్జీ (ఎంపీ నామినేట్), కందుల నాగరాజు(కార్పొరేటర్), డేనియల్ జోసఫ్ పాల్గొని వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు.

కెనరా బ్యాంక్ Canara Bank
ప్రాంతీయ కార్యాలయం : కాకినాడ
డి.నెం.2-26-1, వార్డు నెం.5, 50 బిల్డింగ్స్ సెంటర్, శ్రీనగర్, కాకినాడ-533003.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. మెస్సర్స్ శ్రీ సాయి టెంట్ హౌస్, యజమాని: కంకటాల నాగ అనంత లక్ష్మీ సూర్యకుమారి, డి.నెం.6-85, యన్‌హెచ్-16, రత్నపూరి, చంఖవరం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533444 (ఋణగ్రహీత).
2. శ్రీమతి కంకటాల నాగ అనంత లక్ష్మీ సూర్యకుమారి, భర్త: కె. శ్రీరామచంద్రమూర్తి, డి.నెం.32-3-13, [illegible], తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534211 (ఋణగ్రహీత).
3. శ్రీ [illegible] వెంకట సుధీర్ కుమార్, తండ్రి: [illegible], డి.నెం.1-119-6, సెక్టార్-12, [illegible], యమ్‌విపి కాలనీ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-533007 (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సర్ఫేసి చట్టం, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ 30 రోజుల ప్రకటన.

[illegible] రూ. 21,86,180.58/- [illegible] 07.08.2023 తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

[illegible] తేది. 20.11.2023 [illegible] సాక్షి (తెలుగు) & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది.28.11.2023న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. 07.08.2023 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి రూ. 21,86,180.58/- [illegible] సెక్షన్ 13(8) ప్రకారం [illegible] సెక్షన్ 13(8) ప్రకారం [illegible]

[illegible]

తేది: 28.11.2023, ప్రదేశం: కాకినాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

పంచకర్ల.. ఓ బ్రోకర్

- ఓ పార్టీలో ఉంటూ మరో పార్టీకి బ్రోకరిజం చేసే చరిత్ర నీది
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి ధ్వజం



సాక్షి, విశాఖపట్నం: ఓ పార్టీలో ఉంటూ మరో పార్టీకి బ్రోకరిజం చేసే పంచకర్ల రమేష్‌బాబు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లను విమర్శించడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి అన్నారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉంటూనే ఇక్కడ అంతర్గత విషయాలను తెలుగుదేశం పార్టీ వ్యూహకర్త రాబిన్ శర్మకి చేరవేస్తూ పంచకర్ల బ్రోకర్‌లా పనిచేశాడని ధ్వజమెత్తారు. జీవీఎంసీ ఎన్నికల్లో గాజువాక పరిశీలకుడిగా నియమిస్తే టీడీపీలో ఉన్న నీ స్నేహితుడి కోసం కాపు సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్ అభ్యర్థిని ఓడించిన చరిత్ర నీది కాదా అని ప్రశ్నించారు. యలమంచిలి టీడీపీ ఎమ్మెల్యేగా నిన్ను గెలిపించిన వారిపైనే అక్రమ కేసులు బనాయించిన వ్యక్తిత్వం నీదని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేగా అక్రమ క్వారీలకు మద్దతిస్తూ.. వసూళ్లు చేసుకుని పబ్బం గడిపిన విషయం మరిచిపోయావా? అని విమర్శించారు. వైఎస్సార్ సీపీకి ఓటమి భయం పట్టుకుందని అంటున్న నిన్ను.. ఓడించేది వైఎస్సార్ సీపీ అనే విషయం మరిచిపోవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో నీవు ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేసినా ఓటమి ఖాయమని రవిరెడ్డి అన్నారు.

నేడు వైజాగ్ మారథాన్

బీచ్‌రోడ్డు: వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ఆదివారం సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. తెల్లవారుజాము 4.45 గంటలకు ఫుల్ మారథాన్, ఉదయం 5 గంటలకు హాఫ్ మారథాన్, 5.30 గంటలకు 5కె రన్, 6.15 గంటలకు 3కె రన్ ప్రారంభమవుతుందన్నారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ రన్ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నారాయణ స్కూల్ విద్యార్థి ఆత్మహత్య

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలసలోని నారాయణ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహాన్ని స్కూల్ యాజమాన్యం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించింది. విద్యార్థిది శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం. ఆత్మహత్యకు గల కారణాలు వెల్లడించకపోయినా.. స్కూల్ సిబ్బంది అతన్ని కొట్టినట్టు సమాచారం. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫేస్‌బుక్ ప్రేమ

ఒక్కటైన వెనిజులా అమ్మాయి.. స్టీల్‌ప్లాంట్ అబ్బాయి



ఉక్కునగరం: ప్రేమకు సరిహద్దులు లేవని చాటి చెప్పారు. ఫేస్‌బుక్‌తో పరిచయమైన వారు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ మెయింటెనెన్స్ ఎలక్ట్రికల్ (సీఎంఈ) విభాగం అధికారి మునుకోటి శ్రీనివాసరావు కుమారుడు గమన్, వెనిజులా దేశానికి చెందిన అలెజాండ్రా ఇస్తేఫెనియాకు ఫేస్‌బుక్ ద్వారా పరిచయం అయింది. ఆ పరిచయం కొన్నాళ్లకు ప్రేమకు దారి తీసింది. ఈ విషయం ఇరువురు కుటుంబ సభ్యులకు తెలపగా వారు అంగీకరించారు. గురజాడ కళాక్షేత్రంలో శనివారం వారి వివాహం హిందూ సంప్రదాయబద్ధంగా జరిగింది.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.